క్లుప్తంగా

న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పాల్గొని అంతర్జాతీయ యువజన దినోత్సవ ప్రాముఖ్యతను, నల్సా పథకం, 2015 గురించి వివరించారు. అలాగే ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రిజిస్టర్ మెడికల్ వైద్యాధికారి దగ్గరికి వెళ్లాలని, ప్రిస్కిప్షన్ ప్రకారం డ్రగ్స్ వాడాలని సూచించారు. డ్రగ్స్ మోతాదుకు మించి వాడడం హానికరం అని డ్రగ్స్ విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దీంతో పాటు ఆర్టికల్ 47, ద డ్రగ్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సిస్ యాక్ట్ 1985, మాదక ద్రవ్యాలు, హెచ్ఐవి, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టిబి అధికారి రవిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్, క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్, ఆర్ ఆర్ సి కోఆర్డినేటర్ నాగరాజు, వైద్యాధికారి సావిత్రి, ఎన్ ఎస్ ఎస్ అధికారి నాగరాజు, ఎన్జీవోలు, లెక్చరర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన


డ్వాక్రా సంఘాలకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు ఉన్నతాధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధిస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని యూకో బ్యాంకు ఏపీ జోనల్ హెడ్ శరవణన్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని యూకో బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ. 3.37 కోట్ల చెక్కులను 23 డ్వాక్రా సంఘాలకు రుణాల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ జోనల్ హెడ్ ప్రశాంత్‌కుమార్, జగదీష్, బ్రాంచ్ మేనేజర్ ఓబులేశు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని ఏపీసీసీ కోఆర్డినేటర్ ఎస్ ఏ సత్తార్, మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికలలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా బీజేపీతో కుమ్మక్కై అనేక అవకతవకలకు పాల్పడిందన్నారు. ఈ విషయమై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జరిగిన లోపాల గురించి మీడియా సమక్షంలో వివరించారన్నారు. ఏపీలో కూడా ఇదే విధంగా జరిగిందని రాహుల్ గాంధీ చెప్పటం గమనార్హం అన్నారు. ఇంకా అనేక విషయాలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమిలోని ఎంపీలు ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్దకు నిరసన తెలియజేయడానికి వెళ్లగా రాహుల్ గాంధీని ఎంపీలను అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాసిర్ ఖాన్, కోటపాటి లక్ష్మయ్య, జాకీర్, అక్రమ్, అన్వర్, మామిళ్ల బాబు, చాన్ బాషా, కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం

కమలాపురం : దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం అని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మదర్‌థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధి యువతతోనే సాధ్యం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో పాల్గొని తమ ప్రతిభ చాటాలన్నారు. ప్రపంచ విద్యార్థులతో పోటీ పడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత తమ సమస్యలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకు రావాలన్నారు. నేటి సమాజంలో యువత సామర్థ్యాన్ని జరుపు కోవడానికి ప్రతి ఏటా ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. రీసోర్స్ పర్సన్ గుణశేఖర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ మాట్లాడారు. అలాగే ప్రగతి జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్ నిర్వహించారు.

• 'మను'లో హర్ ఘర్ తిరంగా


జాతీయ జెండాతో అధ్యాపకులు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మను పాలిటెక్నిక్ ఉర్దూ యూనివర్సిటీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విలయత్ అలీ బేగ్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంలో జెండాలతో భావోద్వేగ బంధాన్ని ఏర్పర్చే లక్ష్యంతో 'హర్ ఘర్ తిరంగా' (ఇంటింటికీ మువ్వన్నెల జెండా) కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. జెండాను చూసినప్పుడు దేశం కోసం మనం చేయాల్సిన కర్తవ్యం, బాధ్యత, త్యాగం మాత్రమే మనకు గుర్తుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు ఒమర్ ఫరూక్, సికందర్ హుస్సేన్, ఖాజా మొయినుద్దీన్, డాక్టర్ అబ్దుల్ ఖవ్వ, అయజుద్దీన్, ఇలియాస్, ఫరూక్, సమీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీపై పోటీ చేసింది టీడీపీ కాదు పోలీసులు

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీపై తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదని, పోలీసులే పోటీ చేసినట్లుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. కడప నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలుగుదేశం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు, ఎంపీ వై.ఎస్ అవినాష్ రెడ్డిని ఉదయమే ఆయన ఇంటి నుంచి పోలీసు వాహనంలో తీసుకెళ్లి వివిధ ప్రాంతాల్లో వందల కిలోమీటర్లు తిప్పడం అప్రజాస్వామికమన్నారు. కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుండి వేలాదిగా టీడీపీ గుండాలు పులివెందుల బూత్‌ల్లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను ఈడ్చడం, రిగ్గింగ్ చేయడం, వాహనాలపై దాడి చేయడం చూస్తే అసలు ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. పోలీసులు, ఎన్నికల కమిషన్, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీఐజీ కోయ ప్రవీణ్ టీడీపీకి నేరుగా సపోర్ట్ చేస్తున్నా ఎన్నికల కమిషన్ ఏమి చేస్తుందో తెలియని దుస్థితి నెలకొందన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇలాంటి పోలీసులను, ఎన్నికల కమిషన్‌ను చూడలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపీ నేతలు ఆర్. నాగేశ్వర రెడ్డి, ఈ. వెంకటరెడ్డి, ఎం. వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో చేతులెత్తేసిన ఈసీ

వైఎస్సార్‌సీపీ మాజీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్

కడప కార్పొరేషన్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ ఘోరంగా విఫలమైందని, పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అధికార పార్టీ నేతలతో రిగ్గింగ్ చేయించారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లంతా ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడంలో ఎన్నికల కమిషన్ తీవ్రంగా విఫలమైందన్నారు. పోలీసులు పక్షపాత వైఖరి అవలంభించి అధికార పార్టీకి తొత్తుల్లా వ్యవహరించారని ధ్వజమెత్తారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేయడం, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులందరినీ హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. జిల్లాలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, పోలీసులే దగ్గరుండి దొంగ ఓట్లు వేయించడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అన్నారు. చరిత్రలో ఎన్నడూ ఇంత దారుణంగా ఎన్నికలు జరగలేదన్నారు. పోలింగ్ బూత్‌లు దూరంగా ఏర్పాటు చేసి ఓటర్లను ఓటింగ్‌కు దూరం చేశారని, డబ్బులు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేసి ఓటర్ల స్లిప్పులు వారే తీసుకొని రిగ్గింగ్ చేసుకున్నారన్నారు. దళితులు, అణగారిన వర్గాలు, మైనార్టీలు, బీసీలు తమ ఓట్లు తాము వేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలను స్వేచ్ఛగా తిరగనిచ్చిన పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులను మాత్రం అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షఫీవుల్లా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్టు


పోలీసుస్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల

కడప కార్పొరేషన్ : ఒంటిమిట్ట ఉప ఎన్నికల సందర్భంగా కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షేక్ షఫీ, మైనార్టీ నాయకుడు అలీ అక్బర్‌లను ఒంటిమిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు లాగి అధికార టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేసుకుంటున్న విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లిన వైఎస్ఆర్‌సీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం


విద్యార్థికి నులిపురుగుల మాత్రలను వేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా



చిన్నారికి అల్‌బెండజోల్ మాత్రను వేస్తున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప ఎడ్యుకేషన్ : కడపలోని శ్రీ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించటం ముఖ్యమన్నారు. దీంతోపాటు ఆహారాన్ని తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా పేగులలో నులిపురుగులు చేరకుండా నివారించుకోవచ్చు అని తెలిపారు. అలాగే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకొనడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. నులిపురుగుల వల్ల అజీర్తి, రక్తహీనత, పేగులలో పుండ్లు, నిద్రలేమి వంటి లక్షణాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సి.వి.కృష్ణవేణి, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ పి.గురు మోహన్ రెడ్డి, హిస్టరీ అధ్యాపకురాలు నాగవేణి పాల్గొన్నారు.

అల్‌బెండజోల్ మాత్రలు వేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు అల్‌బెండజోల్ మాత్రలు వేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. మంగళవారం కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అల్‌బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా మహిళా దినోత్సవం రోజున ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రకటించిన మూడు వరాలకు ఉత్తర్వులు ఎక్కడ బాబు అని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు యు. మరియమ్మ ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహిళా దినోత్సవం రోజున కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశా కార్యకర్తలకు రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు, గ్రాడ్యుటి లక్ష యాభై వేలు ,రెండు కాన్పులకు కాన్పుకు 180 రోజుల ప్రకారం మెటర్నిటీ సెలవులు ప్రకటించటం జరిగిందన్నారు. ప్రకటించి కూడా ఆరు నెలలు పూర్తి అవుతున్నా ఇంతవరకు ఉత్తర్వులు జారీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఈ ఐదు నెలల కాలంలో అనేక మంది ఆశా కార్యకర్తలు రిటైర్మెంట్ అయ్యారని ప్రభుత్వం ప్రకటించి కూడా వారికి బెనిఫిట్ అందక బాధాతప్త హృదయాలతో బాధ్యతలు నుండి రిటైర్మెంట్ అవుతున్నారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తక్షణమే ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు 'రంగనాథన్'

కడప ఎడ్యుకేషన్ : గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణకు సి.సి.(కోలోన్ క్లాసిఫికేషన్) ప్రక్రియను తీసుకొచ్చిన గ్రంథాలయ పితామహుడు డా.ఎస్.ఆర్.రంగనాథన్ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా 'గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా సంచాలకులు, సిబ్బంది కలసి ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవోలను రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీఓలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పేర్కొన్నారు. మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా, జిల్లా మహిళా కన్వీనర్ నిఖిత, కడప నగర అధ్యక్షులు అఖిరా నందన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత సమాజమే లక్ష్యం


డ్రగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఈగల్ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్రియాశీలక పాత్ర పోషించాలని ఈగల్ అధికారులు సూచించారు. మంగళవారం కడప విజ్ఞాన జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ కట్టడి కోసం ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌డిపిఎస్ చట్టాలు, ఎన్‌డిపిఎస్ చట్టంలోని కఠిన శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. ఇళ్లు, పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, గంజాయి విక్రయాలు జరుగుతూ ఉంటే సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి తెలియ చేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విద్యదాస్, లెక్చరర్లు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి


వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న స్టెప్ అధికారులు, హ్యాండ్ 4 యు ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని స్టెప్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో కడప నెహ్రూయువజన కేంద్రం, హ్యాండ్ 4 యు ఆర్గనేజషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యూత్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టెప్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు, హ్యాండ్ 4 యు ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడుతూ యువత మంచి కార్యక్రమాలు చేపట్టి దేశానికి వెన్నుదన్నుగా నిలబడాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు, బెట్టింగులకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వరలక్ష్మి, సుబ్రమణ్యం, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.

ఘన నివాళి


పుల్లయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : చెక్కభజన, కులుకు భజన, జడకోపు, కోలాటాల్లో ప్రసిద్ధి చెందిన సగిలి పుల్లయ్య మరణం కళాకారులకు తీరని లోటని యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చెక్కభజన కళాకారుడు పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలసపాడు మండలానికి చెందిన పుల్లయ్య వేలాది మందికి చెక్కభజన నేర్పారని, ఆయన అనేక రాష్ట్రాల్లో, అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ మొదలైన దేశాల్లో చెక్కభజన ప్రదర్శనలిచ్చి మన జిల్లా కీర్తిని చాటారన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి పార్వతి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నోటిఫికేషన్ జారీ

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గ్రామంలోని గంగమ్మదేవత దేవస్థానంకు సంబంధించి నూతన పాలక మండలి సభ్యుల నియామకం కొరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు గంగమ్మదేవ దేవస్థానం ఈఓ కృష్ణానాయక్ మంగళవారం తెలిపారు. ఈ నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నాటి నుంచి 20 రోజుల లోపల ఆసక్తి గలవారు దరఖాస్తులను కడప జిల్లా దేవాదాయ శాఖ అధికారి వారికి పంపాలన్నారు.

విజయ దుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ


రాహుకాల పూజలు నిర్వహిస్తున్నభక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : కడపలోని శ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి వేకువ జామున పంచామృతాభిషేకం, అనంతరం అమ్మవారికి విశేష అలంకారం చేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. అనంతరం ఆలయ అర్చకులు రాహు కాల పూజ నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


ధర్నాలో పాల్గొన్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా తగిన చర్యలు చేపట్టాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా తొలిరోజు మంగళవారం గేట్ ఎదుట న్యాయమైన డిమాండ్లపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ దాస్, డిపో ప్రెసిడెంట్ తొండలదిన్నె జయరాంలు మాట్లాడుతూ ఉద్యోగులు తమ సమస్యలపై సుదీర్ఘకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ సంయుక్త కార్యదర్శి కోడూరు సుబ్బారావు, డిపో అసిస్టెంట్ సెక్రెటరీలు నాగరాజు, డీపీటీ సుబ్బయ్య, సంయుక్త కార్యదర్శులు జీవైవీఆర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జబ్బార్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ఇది నియంత పాలన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మన రాష్ట్రంలో జరిగేది ప్రజాస్వామ్యం పాలన లేక నియంత పాలన అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎన్.డి .విజయ జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో పులివెందులలో జరిగే ఓటింగ్‌లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అధికారంతో రిగ్గింగ్ చేసుకున్నారన్నారు. ఇలాంటి ఓటింగ్ వ్యవస్థ ఇంతవరకూ చూడలేదన్నారు. ఒకవైపు బీజేపీ ఓట్లను దొంగలిస్తే ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఓట్లు వేయకుండా దౌర్జన్యంగా లాక్కుంటున్నారన్నారు. భగవంతుడు అన్నీ చూస్తూ ఉంటాడన్నారు. తప్పకుండా ఒకరోజు వారు శిక్ష అనుభవించాల్సిందేనన్నారు.

